

శెట్టిఆత్మకూర్‌లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

## రైతు సంక్షేమమే
# ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడుగంటల కరెంట్..
- బీజేపీకి వేస్తే మోటర్లకు మీటర్లు
- కర్ణాటక ప్రజలను నట్టేట ముంచింది కాంగ్రెస్సే
- తెలంగాణలో వారి నాటకాలు నమ్మేదెవరు?
- అభివృద్ధిని చూసి మరోసారి ఆదరించండి
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- శెట్టిఆత్మకూర్, మదనపల్లి, ఈడిగోనిపల్లి, రేకులపల్లి గ్రామాల్లో ప్రచారం

గద్వాల రూరల్, నవంబర్ 14 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తనను మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని శెట్టిఆత్మకూర్, మదనపల్లి, ఈడిగోనిపల్లి, రేకులపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకగా శెట్టిఆత్మకూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. రేకులపల్లిలో చర్చిలో ప్రార్థనలు చేయగా ముదిరాజులు చేపల వలను బహూకరించారు. ఈడిగోనిపల్లిలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజల మధ్యకు వచ్చి మాయమాటలు చెప్పే నాన్‌లోకల్ వ్యక్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే మూడుగంటల కరెంటు, బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లు బిగిస్తారని అన్నారు. నమ్మి ఓటేసిన ప్రజలను కర్ణాటకలో నట్టేట ముంచారని, తెలంగాణలో నాటకాలు వేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వారికి తగిని బుద్ధి చెప్పాలని సూచించారు. చరిత్రలో నిలిచిపోయేలా గద్వాల మండలాన్ని అభివృద్ధి చేసుకున్నామని, సీఎం కేసీఆర్ పాలనలో సాగు, తాగునీటి కష్టాలు, కరెంటు కోతలు లేవన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేసుకున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ నాయకుల కుట్రపూరిత మాటలు నమ్మొద్దన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను, తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కౌన్సిలర్ దౌలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సర్పంచులు శివమణి, సునీత, గోపాల్, హనుమంతురెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, నీలేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శ్యామ్, కేశవరెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మన్న, కృష్ణ, యూత్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లిలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల

# ఝూటామాటలు నమ్మొద్దు

- బోయలను ఎస్టీల్లో చేర్చడం కేంద్రం బాధ్యత
- గతంలోనే రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేశాం
- చివరి ఆయకట్టు వరకు సాగునీరిస్తాం: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తా
- మీ బిడ్డలా ఆదరించండి: బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు




మానవపాడులో ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని పూలమాలతో సన్మానిస్తున్న ముస్లింలు

మానవపాడు, నవంబర్ 14 : బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గతంలో రెండుసార్లు అసెంబ్లీలో తీర్మాణం చేస్తే కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి గుర్తు చేశారు. కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెసోళ్ల మాయ మాటలు నమ్మితే గోస పడడం ఖాయమని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం ఒక్క బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మానవపాడు మండలకేంద్రంతోపాటు చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, అమరవాయి, పెద్ద ఆముదాలపాడు, నారాయణపురం గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు, ఎమ్మెల్సీ చల్లా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు విజయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ చల్లా మాట్లాడుతూ విజయుడు నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని, పేదోళ్ల సమస్యలు తెలిసిన వ్యక్తిని గెలిపించుకుంటే నియోజకవర్గంలోని సమస్యలు తీర్చుతాడని తెలిపారు. విజయుడిని సొంత బిడ్డలా ఆదరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయని, నిరుపేదలకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే మూడేండ్లలో ఆర్డీఎస్ కింద ఉన్న చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేందుకు రిజర్వాయర్ల నిర్మాణం, చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి లింక్ కాల్వ తీసుకొచ్చి ఆర్డీఎస్‌లో కలపడం, నెట్టెంపాడ్ 99, 100 ప్యాకేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. మండలకేంద్రానికి మంజూరైన గురుకుల పాఠశాల గట్టులో కొనసాగుతున్నదని, భవనాన్ని అద్దెకు తీసుకొని మానవపాడులోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని, విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో రూ.5లక్షల ఉచిత బీమా, తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యం, పింఛన్ రెట్టింపు, రైతుబీమా పెంపు వంటి పథకాలను పొందుపర్చినట్లు వివరించారు.

**పోతులపాడులో ఎమ్మెల్సీకి ఘన స్వాగతం**

ప్రచారంలో భాగంగా పోతులపాడుకు వచ్చిన ఎమ్మెల్సీ చల్లాకు గ్రామస్తులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ ప్రచారానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరు కాగా వారిని ఎమ్మెల్సీ ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు. విజేయుడు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ తనను ఆదరించి గెలిపించాలని కోరారు. మానవపాడులో ముస్లింలు ఎమ్మెల్సీని సత్కరించి మద్దతును తెలిపారు.



పోతులపాడులో ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, ఎమ్మెల్సీ చల్లాను గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు



- రథాన్ని లాగేందుకు పోటీ పడిన భక్తజనం
- వెంకన్నను దర్శించుకొని మొక్కులు చెల్లింపు

## రమణీయం..
# రథోత్సవం

కేటీదొడ్డి, నవంబర్ 14 : పాగుంట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలొచ్చారు. కాగా సాయంత్రం నిర్వహించిన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. సుందరంగా, ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన రథంపై దేవదేవుని ఉత్సవమూర్తులను ఉంచి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు లాగారు. భక్తులు స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే
# దళితుల అభివృద్ధి

- ఎస్సీ వర్గీకరణ సీఎం కేసీఆర్ వల్లే సాధ్యం
- దళితులను మోసం చేసింది కాంగ్రెస్సే..
- భారీ మెజార్టీతో విజయుడి గెలుపు ఖాయం
- రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి
- టీఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గార్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గార్ హుస్సేన్

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 14 : బీఆర్‌ఎస్‌తోనే దళితుల అభివృద్ధి సాధ్యమని, భారీ మెజార్టీతో అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి గెలుపు ఖాయమని టీఎమ్మార్పీఎస్ జాతీయవర్కింగ్ ప్రెసిడెంట్ బల్గార్ హుస్సేన్ అన్నారు. ఎర్రవల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన ఉన్నందున రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. దళితుల అభ్యున్నతికి అంబేద్కర్ తరువాత అంతగా ఆలోచించిన మేధావి కేసీఆరేనని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ కేసీఆర్ వల్లే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులను మోసం చేసిందని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. దళిత యువకుల ప్రాణాలను బలి తీసుకున్న హస్తం పార్టీకి మాదిగ, మాదిగ ఉపకులాలు ఒక్క ఓటు కూడా వేయవద్దని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలకు రాబోయే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. ఎమ్మెల్సీ చల్లా బలపర్చిన అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడికి విజయం దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో రాజ్‌కుమార్, సుమన్, లక్ష్మణ్, జయన్న, దేవన్న, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సతీమణి సురేఖకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేస్తున్న ఆలయ ఈవో



## జోగులాంబ సన్నిధిలో
# మెగా ఫ్యామిలీ

అలంపూర్, నవంబర్ 14 : అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, కూతుళ్లు మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఈవో పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా ఉభయాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం వారికి ఈవో స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను బహూకరించారు.